
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

ఆదివారం 19 అక్టోబరు 2025 | 7



శేష శైలా వాస శ్రీ వెంకటేశా.. నిదురించు మా అయ్య శ్రీ చిద్విలాస.. శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు.. అలమేలు మంగకు అలకరానీయకు.. అంటూ అర్చకులు స్వామికి శనివారం రాత్రి పవళింపు సేవ చేశారు.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకుని భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. స్వామిని మనసారా చూసి.. ఆపదమొక్కులవాడా.. అనాథరక్షక గోవిందా.. గోవింద అంటూ వేడుకున్నారు.. మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

8

శేష శైల వాసా.. శ్రీ వెంకటేశా!



ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం వీఎల్‌పురంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమన్నారు. భావితరాల భవిష్యత్ మన చేతుల్లో ఉందన్నారు. దీనిలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఇప్పటి వరకు నగరంలో 4780 మొక్కలు నాటినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్సాలీ, ఏడీహెచ్ అనిత, సిఎంఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ కీర్తి



సర్కారు ఏం చేయగలదు?
అధికారంతో ఏదైనా చేయగలదు..
అభివృద్ధి చేయగలదు..
అరాచకమూ సృష్టించగలదు..
గత ఐదేళ్లూ జనం అరాచకం చూశారు..
భరించలేక ఓటుతో తరిమికొట్టారు...
ప్రభుత్వాన్నే మార్చేశారు..
ఇప్పుడేం చూస్తున్నారు?
హామీల అమలు చూస్తున్నారు..
అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారు..
గూగుల్ రాకతో మన గతి
సూపర్ అంటూ ఆనందపడుతున్నారు..
చీకట్లు తరిమికొట్టే చంద్రన్న పాలనలో
ఆనంద దీపావళికి సన్నద్ధమవుతున్నారు..

దీపావళి.. చెడుపై విజయానికి సూచిక.. చీకట్లు తొలగించి వెలుగులు అందించే పండగ.. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో చీకట్లు కమ్ముకున్నాయి.. కూటమి ప్రభుత్వంలో ఎన్నో కొత్త వెలుగులు వచ్చాయి. పింఛన్ల పెంపు నుంచి ఉచిత గ్యాస్, ఫ్రీబస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో, విద్యుత్ బిల్లుల తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజల జేబుల్లో కాసులు గలగలలాడుతున్నాయి. అటు కొత్తరేషన్ కార్డులు, పాస్ పుస్తకాల జారీ. గుంతల్లేని రహదారులు, ఇటు అభివృద్ధి, అటు పెట్టుబడుల వెల్లువతో జిల్లా ముఖచిత్రం మళ్లీ మారుతోంది. మూతపడ్డ అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి రూ.5కే పేదలు కడుపునిండా భోజనం చేసేలా చేస్తోంది. డీఎస్సీ పోస్టుల మొదలు మళ్లీ వచ్చే ఏడాది ఇంకో డీఎస్సీ, అటు పోలీస్, అటవీశాఖల్లో పోస్టుల భర్తీతో నిరుద్యోగుల మోము మతాబుల్లా వెలుగుతోంది.

- అరాచకపు చీకట్లు తొలగాయ్
- అభివృద్ధి వెలుగులొస్తున్నాయ్
- సంక్షేమంతో మంచి రోజులు
- సూపర్ సిక్స్ పథకాలతో వెలుగు
- పోస్టుల భర్తీతో నిరుద్యోగుల సంతోషం
- రేపే దీపావళి

నాడు కష్టాలు.. నేడు వెలుగులు

- **పింఛన్ల ధమాకా :** ప్రభుత్వం మారింది.. ప్రజల దశ మారింది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు రూ.3 వేల పింఛన్ రూ.4 వేలు, అనారోగ్య బాధితులకు రూ.15 వేల చొప్పున పెంచి ఒకటో తేదీనే అందజేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 2,72,107 మందికి రూ.117 కోట్లు, కోనసీమలో 2,36,705 మందికి రూ.101 కోట్లు, తూర్పులో 2,35,502 మందికి రూ.103 కోట్లు అందుతున్నాయి. ఉద్యోగులకు ఒకటినే జీతాలిస్తున్నారు.
- **తల్లికి వందనం :** ఇచ్చిన హామీ మేరకే ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లివందనం డబ్బులు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో 5,88,378 మంది విద్యార్థులకుగాను 3,85,601మంది తల్లులఖాతాల్లో రూ.764 కోట్లు జమైంది.
- **ఉచిత గ్యాస్ :** ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలవుతోంది. ఉమ్మడి జిల్లాలో 13 లక్షలగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తొలి ఉచిత సిలిండర్ 11.52 లక్షల మంది వినియోగించుకోగా రూ.95 కోట్లు జమచేసింది.
- **ఉచిత బస్సు:** ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసింది. ఉమ్మడి జిల్లాలో 25.52 లక్షల మందికిపైగా మహిళలకు లబ్ధి చేకూరుతోంది.
- **అన్నదాత సుఖీభవ :** ఈ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.2 వేలకు, రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు కలిపి మొదటి విడతగా రూ.7 వేలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల మందికిపైగా రూ.300 కోట్లకుపైగా జమ చేసింది.
- **పాస్‌బుక్‌లు :** ఐదేళ్లపాటు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వకుండా గత వైసీపీ తిప్పలు పెట్టింది.ప్రభుత్వం మారాక రాజముద్రతో కాకినాడ జిల్లాకు 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూ.గో. 95 వేలు జారీ చేశారు.
- **డీఎస్సీ సక్సెస్ :** గత ఐదేళ్లపాటు ఆచూకీ లేని డీఎస్సీ పోస్టులను భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 1,241 మంది నిరుద్యోగులకు ప్రభుత్వ కొలువులు దక్కాయి. వచ్చే ఏడాది మరో డీఎస్సీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
- **ఉద్యోగులకు డీఏ :** దీపావళి కానుకగా ప్రభుత్వం ఉద్యోగులకు శనివారం ఒక డీఏ ప్రకటించింది. పోలీసులకు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ ఈఎల్ ప్రకటించింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఎర్న్‌లీవ్ ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు దీపావళికే పదోన్నతులు ఇస్తామని ప్రకటించింది.
- **జీఎస్టీ పండుగ :** ఇక కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలు లాభపడ్డారు. నిజమైన దీపావళి ఇది.

రోడ్లు వేశారు.. నరకం తప్పించారు!

వైసీపీ పాలనలో ప్రజలు రహదారులపై నరకం చూశారు. ప్రభుత్వం మారగానే సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో 900 కిలోమీటర్ల మేర అధికారులు 350కిపైగా రోడ్లను గుర్తించి రూ.70.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చారు. కాకినాడ- జొన్నాడ రహదారి రూ.225 కోట్లు, కాకినాడ -రాజమండ్రి కెనాల్ రోడ్డు రూ.160 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయ్..

సీఎం చంద్రబాబు కృషితో అనేక కంపెనీలు, పర్యాటక ప్రాజెక్టులు తరలివస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్, రూ.2,800 కోట్లతో కొత్తగా ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్లాంట్‌కు ఏర్పాటు చేయనుంది. కోనసీమ, కాకినాడలో రూ.300 కోట్లు పర్యాటక పెట్టుబడులు పెట్టనున్నారు.

నాడు మైక్రోసాఫ్ట్.. నేడు గూగుల్

నేడు హైదరాబాద్ ఇలా ఉందంటే దానికి కారణం చంద్రబాబు.. ఎందుకంటే నాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను రప్పించారు.. నేడు విశాఖకు గూగుల్ రప్పిస్తున్నారు. దీంతో నిరుద్యోగుల కష్టాలు తీరనున్నాయి. కొత్త వెలుగులు రానున్నాయి.. తూర్పుగోదావరి జిల్లాలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేశారు. మీకో బిజినెస్ ఐడియా ఉందా.. అక్కడికి వెళితే చాలు అంతా వాళ్లే చూసుకుంటారు.

ఖరీఫ్.. రిలీఫ్!



చివరి వరకూ సాఫీగా కొనుగోళ్లు

- 27 నుంచి 221 కేంద్రాలు ఏర్పాటు
- 5.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి
- 4 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
అన్నదాత పంట పండింది.. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఏటా సాధారణంగా 2.5 మెట్రిక్ టన్నుల నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించేవారు.దీంతో చివరిలో రైతులు ఇబ్బంది పడేవారు.గత రబీ సీజన్‌లో చివరి రైతులు ఇబ్బందులు పడ్డారు.ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా రబీలో ధాన్యం మంచి ధరకు కొనుగోలు చేయడంతో పాటు 24 గంటల్లో నగదు రైతు ఖాతాల్లో జమ చేయడంతో అందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలనే ఆలోచనతో ముందుకు వచ్చిన సంగతి తెలిసింది. దీంతో చివరి పంట రైతులు ఇబ్బంది పడ్డారు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతుల నుంచి ఈసీజన్‌లో ఎక్కువ ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది. మొత్తం 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేయగా అందులో 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సీఎంఆర్‌కు సేకరించడానికి ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థకు లక్ష్యం నిర్దేశించింది.ఈ నెల 27 నుంచి కొనుగోళ్లు ప్రారంభించనున్నారు.

74,793 హెక్టార్లలో సాగు

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 74, 793 హెక్టారల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఇప్పటి వరకూ 445.9 హెక్టార్లలో వరి కోతలు పూర్త య్యాయి. దీపావళి తర్వాత కోతలు పుంజు కుని డిసెంబరు 15వ తేదీ వరకూ కోతలు జరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఈ నెల 27 నుంచి ధాన్యం కొనుగోలు ఆరంభం కానుంది. ఇప్పటికే కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు. 221 రైతు సేవా కేంద్రాల్లో ఒకేసారి ధాన్యం కొనుగోళ్ల ఆరంభిస్తారు.17 శాతం తేమ ఉంటే కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీ క్వింటా ధాన్యానికి రూ.2369, గ్రేడ్-ఎ రకానికి రూ.2389 ఇవ్వవలసి ఉంది. గోనె సంచుల వినియోగచార్జీలు, కూలీల చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. క్వింటాకు గోనె సంచుల వినియోగచార్జీ రూ.4.74, కూ లీల చార్జీ రూ.22 వరకూ ప్రభుత్వం ఇస్తుం ది.మద్దతు ధరతో చార్జీలకు సంబంధం లేదు.

ఏం కష్టమొచ్చిందో..
పిల్లలను బడికి పంపి.. వివాహిత ఆత్మహత్య

స్కూల్ ఆటోను ఢీకొట్టిన కారు

8

రేపు పీజీఆర్ఎస్ రద్దు
కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని పురస్కరించుకుని సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు గమనించాలన్నారు. ప్రజలు సమస్యలను 1100 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. జిల్లా ప్రజలంతా సురక్షితంగా ఆనందంగా దీపావళిని జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం స్పెషల్ కలెక్టర్‌గా అభిషేక్‌కు బాధ్యతలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు ఎల్ఎఅండ్ఆర్ఆర్ అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ (2019 బ్యాచ్ ఐఏఎస్)కే స్పెషల్ కలెక్టర్ పోలవరం బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకూ ఇక్కడ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేసిన సరళా వందనం బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఐఏఎస్ వి.అభిషేక్‌కు ఫుల్ అడిషనల్ చార్జిని అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు ది గ్రేట్ రాజమహేంద్రవరం
షాపింగ్ ఉత్సవం

రాజమహేంద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వాణిజ్య, వ్యాపార రంగాలకు నూతనోత్సాహం నింపే లక్ష్యంతో ఆదివారం ఆనందరీజెన్సీ పందిరి ఫంక్షన్ హాల్‌లో ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పట్ల అవగాహనలో భాగంగా వినియోగదారుల్లో చైతన్యం నింపడానికి ఈ నెల 14నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. లక్కీడీప్ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.



కొండగుంటూరులో అక్రమ గ్రావెల్ తవ్వకం ప్రాంతంలో మైన్స్ అధికారులు

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మైన్స్ అధికారుల దాడి

దివాన్‌చెరువు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమ తవ్వకాలపై అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. మండలంలోని కొండ గుంటూరు పరిధిలోని హైటెన్షన్ విద్యుత్ లైన్ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నట్టు గనులు, భూగర్భ శాఖాధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు శనివారం ఆకస్మికంగా దాడులు చేశారు. చాలా కాలం నుంచి అక్రమంగా తవ్వడంతో కొండ ఖాళీ అయిపోయింది.గుట్టలు మాత్రమే మిగిలాయి. దీంతో అధికారులు అక్రమ తవ్వ కాలు సాగిస్తున్న యంత్రాలతో పాటు వాహ నాలను సీజ్ చేసినట్లు జిల్లా గనుల శాఖా ధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు జిల్లాలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.తనిఖీల్లో జ్యోతిర్మయి, శ్రీనివాస్, జిల్లా గనులు, భూగర్భశాఖతో పాటు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఎక్స్‌పోకు విశేష స్పందన

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ మెగా ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ఏపీ ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీ తగ్గిన ఎలక్ట్రికల్ పరికరాల ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరై ఎక్స్‌పోను పరిశీలించారు. జీఎస్టీ తగ్గింపు వివరాలను ఎస్ఈ తిలక్ కుమార్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకం ద్వారా అదనంగా 7 శాతం పన్ను తగ్గింపును పొందవచ్చన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు చిన్న ,మధ్యతరగతి ప్రజలకు నిత్యావసరాలను అందుబాటులోకి తెచ్చేలా రూపొందించారని చెప్పారు. ప్రదర్శనలో లైట్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు కంప్యూటర్లు, వాటర్ హీటర్లు, వాషింగ్ మిషన్లు, పునరుత్పాదక పరికరాలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.



స్టాల్స్ పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సోము

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుండడం రాష్ట్రానికి గర్వకారణమని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఐటీ విప్లవకారుడిగా గుర్తించాలని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు విషయంలో సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమని, భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు విశాఖపట్నం కీర్తి పెరుగుతుందన్నారు. గూగుల్ సెంటర్ వస్తే పర్యావరణానికి హాని అంటూ వైసీపీ నాయకులన్నాయి నొక్కులు ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డికి గూగుల్ అంటే భయమని..ఎందుకంటే వారి చరిత్ర అంతా గూగుల్‌లో దొరుకుతుందని ఎద్దేవా చేశారు.అనపర్తి నియోజకవర్గంలో తనపై ఆరోపణలు చేసేవారు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.మట్టి, మద్యం, ఇసుక కాంట్రాక్టుల్లో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.అవినీతి చేసినట్టు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ముగిసిన బ్రహ్మోత్సవం


చక్రస్నాన మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు, చైర్మన్, ఈవో

- వైభవంగా స్వామివారి చక్రస్నానం
- మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం
- స్వామివారి ఏకాంత సేవ
- ముగింపు ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు




వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం


నవకుంభ ఆవాహన నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

ఆత్రేయపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామి వారిని దర్శించుకుని బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు తనయుడు సంజీవ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని మహాపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారు వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ మేళతాళ మంగళ వాయిద్యాలతో గౌతమి గోదావరివద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామివారి చక్రస్నాన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు.


ధ్వజపతాకాన్ని తీసుకువస్తున్న చైర్మన్, ఈవో

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు, అమలాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో పాల్గొని తన్మయత్వం పొందారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు. రాత్రి స్వామివారి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాదాశీర్వచనం నిర్వహించి స్వామి వారి అద్దాల మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ కనుల పండువగా నిర్వహించారు. 9 రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల వాయిద్యాలు, విద్యుత్, పులపుష్పాలంకరణ, ఫొటోషూట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పోటెత్తిన భక్తజనం...

శనివారం వివిధ రాష్ట్రాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమాడవీధులలో ఏడుప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.62.13 లక్షల ఆదాయం లభించినట్టు ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు

స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు ఆదివారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అష్టోత్తర పూజలు, కల్యాణాలు నిర్వహించుకునే భక్తులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు నిర్వహించి తూర్పు రాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించి అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత నారాయణశర్మ

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దరు దాతల నుంచి రూ.2.50 లక్షలు విరాళంగా సమకూరాయి. హైదరాబాద్‌కు చెందిన కె.నారాయణశర్మ రూ.1,00,116... కాకినాడకు చెందిన కురువెల్ల విజయబాబు రూ.1.50 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. దాతల వెంట రెవెన్యూ ప్రొటోకాల్ భాస్కరప్రసాద్, టీడీపీ నాయకుడు పసుపులేటి చక్రి తదితరులున్నారు.

మురమళ్ళ వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.21.39 లక్షలు

ఐ.పోలవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి హుండీల్లో కానుకలను లెక్కించగా 206 రోజులకు రూ.21.39 లక్షల ఆదాయం చేకూరిందని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీవీఎస్ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో శనివారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.21,05,651, అన్నదాన హుండీ ద్వారా రూ.33,490 సమకూరింది. మొత్తం ఆదాయం రూ.21,39,141గా ప్రకటించారు. దీంతో పాటు 17 గ్రాముల బంగారం, 181 గ్రాముల వెండి సమకూరింది. తొలుత అర్చకుడు పేటేటి శ్యామల కుమార్ హుండీలకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, సిబ్బంది మల్లిబాబు, గొలకోటి బుజ్జి, మాచరయ్యతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు సిబ్బంది, సత్యసాయి సేవాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం


తలపడుతున్న ఫెన్సింగ్ క్రీడాకారులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తుమ్మల బాబు

సామర్లకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఉండూరు ఏడీబీ రోడ్డులో లక్ష్య ఇంటర్‌నేషనల్ విద్యాసంస్థ ఆవరణలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఫెన్సింగ్ క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 12వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అండర్-14 బాలురు, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ముఖ్య అతిథులు ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్వీ కృష్ణమోహన్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ దీపక్‌రెడ్డి, పాఠశాల డైరక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాసు మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, క్రమశిక్షణ జీవితంలో భాగమవుతుందన్నారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండ బాబు, పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రసంగించారు. లక్ష్య ఇంటర్‌నేషనల్ స్కూల్ డైరక్టర్, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా సుగుణారెడ్డి మాట్లాడుతూ అండర్-14 విభాగంలో ఏపీలోని 13 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు విచ్చేశారన్నారు. న్యాయనిర్ణేతల సమక్షంలో అండర్ -14 కేటగిరిలో వ్యక్తిగత, జట్టు విభాగాల్లో ఫాయిల్, సబెర్, ఏపీ కేటగిరిలో పోటీలు నిర్వహించామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన న్యాయనిర్ణేతలు, కోచ్‌లు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

సొంత ఊరికి ఆనందంగా పయనం..

అంతలోనే విషాదం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు


మృతిచెందిన వసంత కుమార్

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న పార్సిల్ లారీని బైక్ ఢీ కొన్న దుర్ఘటనలో భర్త మృతిచెందగా భార్య తీవ్రంగా గాయ పడింది. పోలీసుల అందించిన సమాచా రం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం సమీపంలో లొట్టు కుట్టి గ్రామానికి చెందిన వసంత కుమార్, సంధ్య భార్యాభర్తలు. విజయవాడ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో భర్త వసంత కుమార్ ఉద్యోగం చేస్తూ దీపావళి సందర్భంగా మూడు రోజుల సెలవులు రావడంతో శనివారం తెల్లవారుజామున బైక్‌పై హనుమాన్ జంక్షన్ నుంచి ఇచ్ఛాపురానికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ ధర్మవరం జాతీయ రహదారిపై చేరుకుంది. ఉదయం ఐదు గంటల సమయంలో రోడ్డు పక్కన టైరు పంక్చర్ అయిన పార్సిల్ లారీ నిలిచిపోయింది. దీనిని గమనించక బైక్ వేగంగా వచ్చి లారీని ఢీకొంది. ఈ ఘటనలో వసంత కు మార్ (35) అక్క డికక్కడే మృతిచెందగా సంధ్యకు తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయింది. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎస్ఐ ఎస్.లక్ష్మికాంతం పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన సంధ్యను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. వసంతకుమార్, సంధ్యకు మార్చిలో వివాహం జరిగింది. పెళ్లయిన 7 నెలలకే ఈ ఘటన జరిగి వసంతకుమార్ మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. దీపావళికి సొంత ఊరిలో ఆనందంగాగ డుపుదామనుకున్నా ఆ జంటను రోడ్డు ప్రమాదం విడదీసిందని విలపిస్తున్నారు.

'నన్నయ'లో డిసెంబరులో అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 5,6 తేదీల్లో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో సరిహద్దులు.. వ్యవసాయ-ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో అనువర్తనాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం వీసీ ఆవిష్కరించారు. సదస్సుకు సంబంధించి నవంబరు 24వ తేదీలోపు పరిశోధనపత్రాలు సమర్పించవచ్చని ఆమె తెలిపారు.

మందు పార్టీకి పిలిచి... పీక కోసి చంపేసి...

- కాకినాడలో యువకుడి దారుణ హత్య
- ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఘాతుకం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు


మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం


శామ్యూల్ రాజు (ఫైల్)


విలపిస్తున్న శామ్యూల్ పిన్ని

కాకినాడ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని ప్రేమ వ్యవహారం కడతేర్చింది. ఈ దారుణ హత్య శనివారం కాకినాడలో జరిగింది. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం రజకపేటకు చెందిన గంటా శామ్యూల్ రాజు (18)కి తల్లి సత్యవేణి, 9వ తరగతి చదువుతున్న చెల్లి కీర్తన ఉన్నారు. అతడి తండ్రి వీరబాబు కొంతకాలం క్రితం మృతి చెం దడంతో కుటుంబ భారం సత్యవేణిపై పడింది. ఆమె దోశ, ఇడ్లీ పిండి దుకాణాలకు వేస్తూ జీవనం సాగిస్తుంది. తల్లికి చేదోడువాదోడుగా ఉండేందుకు శామ్యూల్ రాజు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి వరకు చదివి మానేశాడు. గత కొన్నేళ్లుగా తన ఇంటి సమీపంలోని సెల్ పాయింట్‌లో పని చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నాడు. అయితే తనతోపాటు చదువుకున్న పాఠశాల స్నేహితుడైన స్థానిక ఎల్విన్‌పేటకు చెందిన అభివర్థన్ అలి యాస్ అభికి శామ్యూల్ రాజుకు మధ్య గతంలో ప్రేమ వ్యవహారంలో మనస్పర్థలు వచ్చి అది కాస్తా అభి మనస్సులో కక్షగా నాటుకుపోయింది. అప్పటి నుంచి శామ్యూల్ రాజుని అంతమొందించేందుకు అభి సమయం కోసం వేచిచూస్తున్నాడు. శామ్యూల్ రాజుతో మంచిగా ఉన్నట్టే నటిస్తున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం... శుక్రవారం రాత్రి శామ్యూల్ రాజుకు ఫోన్ చేసి మందు పార్టీ చేసుకుందాం రమ్మన్నాడు. దీంతో శామ్యూల్ రాజు సెల్ పాయింట్ కట్టేసి తన స్నేహితుడు రమ్మన్న ప్రదేశం కొండయ్యపాలెం శారదమ్మ గుడి సమీపంలోని చీడీల పోర రోడ్డులోని నగరపాలక సంస్థ మేజర్ డ్రైన్ అవతల నిర్జల ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ అప్పటికే అభి తన స్నేహితుడు శ్రీనివాస్‌తో వేచి చూస్తున్నాడు. ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్న అనంతరం అభి మనస్సులోని పగ వెళ్లగక్కి ఇద్దరు కలిసి శామ్యూల్ రాజుపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు అభి తన కూడా తెచ్చుకున్న చాకుతో శామ్యూల్ రాజు పీక కోయడమే కాకుండా ఇంకా చావలేదని పీకకు తాడు వేసి ఆ డ్రైనేజీలో ముంచాడు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక పైకి తీసి శామ్యూల్ రాజు మృతదేహాన్ని అక్కడ వదిలేసి ఇద్దరు పరారయ్యారు. శనివారం ఉదయం అటువైపు బహిర్భూమికి వచ్చిన వారు చూసి స్థానికులను విషయాన్ని తెలియజేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడికి చేరుకున్న కుటుంబీకుల నుంచి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సంఘటనా స్థలి వద్ద మృతుడి తల్లి సత్యవేణి, చెల్లి కీర్తన విలపించిన తీరు చూపరుల మనస్సులను కలచివేసింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు.

నమ్మించి నట్టేట ముంచి..

చిట్టీలు, అధిక వడ్డీ ఆశ చూపి

రూ.కోటికి టోకరా

పెద్దాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు


పెద్దాపురం పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

పెద్దాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో నమ్మకంగా ఉంటూ నట్టేట ముంచేశాడు ఓ వ్యక్తి. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన ఎలుబండి చక్రపాణి గ్రామంలో ప్రజలతో నమ్మంగా ఉంటూ వారి దగ్గర నుంచి దశలవారీగా చిట్టీలు కట్టించుకోవడం, అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి దఫ దఫాలుగా రూ.కోటి వరకూ సొమ్ములు లాగేశాడు. గ్రామానికి చెందిన సుమారు 80 మంది అతడి వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నారు. బాధితులు తమ డబ్బులు కావాలని అడగడంతో దాటవేత ధోరణి ప్రదర్శించడంతో అనుమానం కలిగింది. దీంతో డబ్బుల కోసం చక్రపాణిని గట్టిగా ప్రశ్నించడంతో బాధితులపై ఎదురు దాడికి దిగాడు. దీంతో వారంతా స్థానిక పోలీస్‌స్టేషను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా ప్రస్తుతానికి ఎటువంటి లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని, బాధితులు స్టేషన్‌కు వచ్చి తాము మోసపోయామన్న విషయాన్ని తెలిపారని, లిఖితపూర్వకంగా ఫిర్యాదందితే విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కాట్రేనికోన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు జడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు శనివారం సస్పెండ్ అయ్యారు. సహచర ఉపాధ్యాయురాలిని వేధించడమే దీనికి కారణం. తనను వెంకటేశ్వరరావు వేధిస్తున్నాడంటూ జిల్లా విద్యాశాఖాధికారికి బాధిత ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేసింది. డీఈవో షేక్ సలీంబాషా విచారణ నిమిత్తం త్రిమెన్ కమిటీని నియమించారు. త్రిమెన్ కమిటీ నివేదికను డీఈవో సలీంబాషా జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఆదేశాలతో వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. వెంకటేశ్వరరావుకు సహకరించిన మరో ఉపాధ్యాయుడు ఓ.జగపతిరావును పల్లం జడ్పీహైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

అమలాపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఈదరపల్లికి చెందిన నార్ని రాజా (21) అదృశ్యంపై అమలాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజా శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు.

స్కూల్ ఆటోను ఢీకొన్న కారు

ముగ్గురు చిన్నారులకు స్వల్పగాయాలు, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు





సంఘటనా స్థలంలో వాహనాలు

రాజానగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా శనివారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్కూలు పిల్లలతో దివాన్‌చెరువు నుంచి వస్తున్న ఆటో గైట్ కళాశాల ఎదురుగా యూటర్న్ తీసుకుని సర్వీసు రోడ్డు నుంచి చక్రద్వారబంధం వెళ్తున్న తరుణంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను బలంగా ఢీకొంది. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన కొంతమంది దివాన్‌చెరువులోని సూర్యగ్లోబల్ స్కూల్లో 5,6,7 తరగతులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో గైట్ కళాశాల వద్ద సర్వీసు రోడ్డులో కారు ఢీకొనడంతో ఆటో పల్టీలు కొడుతూ బోల్తా పడింది. దీంతో ఉన్న 11 మంది పిల్లల్లో ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, ఆటో డ్రైవర్ కుక్కల శ్రీనుకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను స్కూల్‌కు పంపి...

అనపర్తిలో వివాహిత ఆత్మహత్య

అత్తింటి వేధింపులే కారణమంటున్న మృతురాలి తల్లి


శిరీష (ఫైల్)


పోలీసుల ఒడిలో అమాయకంగా చూస్తున్న శిరీష కుమార్తె

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో శనివారం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన నమ్మి సంతోష్ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి ధవళేశ్వరానికి చెందిన శిరీష (30)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి సంతానం. కొంతకాలంగా వారు అనపర్తిలోని సిందుట వర్క్స్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన తరువాత ఒక పాపను, బాబును స్కూలుకు పంపించిన శిరీష బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆమె ఎంతకూ పలకకపోవడంతో అత్త కృష్ణవేణి చుట్టుపక్కల వారిని పిలవగా వారు తలుపును పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సమాచారంతో ఏఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ సుజాత సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ఉదయం జండూ బామ్ కనిపించడం లేదని అడగగా వెతుక్కోండని శిరీష సమాధానం చెప్పడంతో కొంత ఘర్షణ జరిగిందని, తాను ఇంటి నుంచి వెళ్లిపోయానని సంతోష్ చెప్తున్నాడు. అయితే మృతురాలి తల్లి లంక అమ్మాజీ మాత్రం భర్త, అత్త, ఆడపడుచు వేధింపుల వల్లే తమ కుమార్తె మరణించిందని చెప్తుంది. కుమార్తె మృతితో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారిగా మిగిలారని ఆమె రోదన చూపరులను కలచివేసింది. రెండేళ్ల కూడా నిండని శిరీష కుమార్తె ఇంటికి వచ్చిన పోలీసులను అమ్మ అమ్మ అంటూ మృతదేహం ఉన్న గదివైపు రమ్మని పిలవడం అక్కడున్న వారి హృదయాలను కలచివేసింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియాఆసుపత్రికి తరలించామన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

కోనసీమ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీహెచ్ఎంవో దుర్గారావుదొర

అంబాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్తీ టిఫిన్ తిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర శనివారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మెడ్‌యునైటెడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది బాధితుల నుంచి డీఎంహెచ్‌వో, తహశీల్దారు చినబాబు వివరాలు సేకరించారు. డీఎంహెచ్‌వో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న అంబాజీపేటలోని ఓ హోటల్‌లో పలువురు టిఫిన్ తిని ఆ రోజు సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఫుడ్‌పాయిజన్‌కు సంబంధించి ఇప్పటికే వైద్య సిబ్బంది వివరాలు సేకరించడం జరిగిందన్నారు. టిఫిన్ తిన్న ఆ హోటల్‌లో సరుకుల, తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ప్రయోగశాలకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆ హోటల్‌ను పరిశీలించారు. ఈవోపీఆర్డీ కె.శ్రీనివాస్, ఆర్ఐ ఏడుకొండలు,హెల్త్‌సూపర్‌వైజర్ రాధానరసింహం, వీఆర్వోలు ఉన్నారు.

కార్తీక స్నానాలకు రేవులను సిద్ధం చేయండి

కోటిలింగాల ఘాట్ పరిశీలనలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గోదావరి స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక కోటిలింగాల రేవును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులు గోదావరి స్నానాలు ఆచరిస్తారని వారికి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని, రేవులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఘాట్ల వెంబడి నది ఒడ్డున ఇసుక వేయించాలని, 250నావలను ఉంచాలని చెప్పారు. రేవుల్లో మెరుగైన పారిశుధ్యం కోసం 80 మందిని కాంట్రాక్టు పద్ధతిలో అదనంగా తీసుకున్నామన్నారు. రేవుల వద్ద తాగునీటి పాయింట్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో మజ్జి రాంబాబు, రెడ్డి మణి, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధులకు అడ్డుకట్ట

ఈఎస్ఐ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శైలజ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్త్రీలు ఎదుర్కొంటున్న గైనిక్ సమస్యలతోపాటు, బ్రెస్ట్, యూట్రస్ కేన్సర్ వంటి వ్యాధులను సకాలంలో టీకాలు వేయడం ద్వారా నిరోధించవచ్చని ఈఎస్ఐ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్.శైలజ అన్నారు. శనివారం స్థానిక రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఉచిత వైద్యశిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ ఎలాంటి వ్యాధి తలెత్తినా మనోధైర్యంతో ఉండాలని, దాన్ని ఎదుర్కోవాలన్నారు. ముందుగా ఉచిత వైద్య శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య, ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్‌లతో కలసి డాక్టర్ శైలజ ప్రారంభించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. హౌస్ సర్జన్ కె.వినీత, ఈసీజీ టెక్నీషియన్ శాంతి, స్టాఫ్ దేవి, సందీప్, సత్యనారాయణ వైద్య సేవలందించారు.

దీపావళిని కాలుష్యరహితంగా జరుపుకోవాలి



ఎకో ఫ్రెండ్లీ దీపావళిపై అవగాహన

రాజమహేంద్రవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత దీపావళిని సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ఆయన ఆదేశాలతో జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో సేఫ్ దీపావళిపై విద్యార్థులతో ర్యాలీలు చేశారు. పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ప్రదేశాల్లో అవగాహన కల్పించారు. దీపావళి టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలుష్య రహిత దీపావళితో ఆరోగ్యానికి ఇబ్బంది ఉండదన్నారు. పిల్లలు, యువతను గమనిస్తూ ఉండాలని, వాళ్ల విషయంలో పెద్దలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

రంగంపేట: రంగంపేటలో హైస్కూల్ విద్యార్థులతో పర్యావరణహిత దీపావళిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ టపాసుల వల్ల కలిగే శబ్దం, కాలుష్యం ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందని, ఈ సారి టపాసులు తగ్గించి పర్యావరణానికి హాని చేయని రీతిలో దీపావళి జరుపుకుందామన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.ఐ శివప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ, ఎంపీడీవో వీవీ సాయిబాబు, తహశీల్దార్ అనసూయ, పీహెచ్‌సీ డాక్టర్ వేణుశ్రీలక్ష్మి ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఏపీవో నాగేశు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలు పర్యావరణ హితంగా దీపావళిని నిర్వహించుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ రాహుల్‌మీనా ఓ ప్రకటనలో అన్నారు. శబ్ధకాలుష్యం తక్కువగా ఉత్పత్తి చేసే గ్రీన్ టపాసులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వైఎస్ నరసింహారావు జయంతి


రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, స్వతంత్ర ఉద్యమం వంటి విషయాల్లో రాజమండ్రి వైభవాన్ని జన స్మృతికి అందించిన వ్యక్తి వైఎస్ నరసింహారావని ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్షుడు వి.భాస్కరరామ్ అన్నారు. సమితి వ్యవస్థాపకుడు వైఎస్ నరసింహారావు జయంతి సందర్భంగా శనివారం ఆంధ్ర కేసరి రోటరీ హాల్లో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.కార్యక్రమంలో మాదిరాజు శ్రీనివాస్, జెమ్మి రామారావు, సీపీ రెడ్డి, దేశిరెడ్డి బలరామనాయుడు, కె.అనురాధ పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌మీనాను జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఆయనకు సందర్భంగా మొక్కను అందించారు. రాజమహేంద్రవరంలోని అన్ని రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ నిర్వాహకులు ఆహార భద్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, పేపరుమిల్లు ఎదురుగా నివాసాల మధ్య ఉన్న డంపింగ్‌యార్డు వల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని దానిని అక్కడ నుంచి తరలించాలని కమిషనర్‌ను ఈ సందర్భంగా అనంతరావు కోరారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్యాకేజీ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రతి ఆదివారం రాత్రి 7గంటలకు పంచారామాలకు సూపర్‌లగ్జరీ స్పెషల్ బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ కె.మాధవ తెలిపారు. కార్తీక సోమవారాల్లో పంచారామ పుణ్యక్షేత్రాలను ఒకే రోజు దర్శించే విధంగా ఈ ప్యాకేజీ బస్సులకు నడపనున్నట్టు చెప్పారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ బస్సులు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను దర్శించుకుని అదేరోజు రాత్రి 10 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటాయని తెలిపారు. టిక్కెట్లను ఆర్టీసీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా పొందవచ్చన్నారు. భక్తులు బస్సుకు సరిపడా ఉండి కోరితే వాళ్ల ఊరి నుంచి బస్సులు నడుపుతామన్నారు.







అది వైసీపీ ఏఐతో చేయించిన ఫేక్ వాయిస్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



వేర్వేరు సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): లిక్కర్ సిండికేట్ పేరుతో తమ పార్టీ నగర అధ్యక్షుడు వాయిస్‌గా చెబుతూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఆడియో టేపు వైసీపీ వాళ్లు ఏఐను ఉపయోగించిన సృష్టి అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఒక ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు కూడా చిట్బూరి ప్రవీణ్ అనే వ్యక్తికి వార్నింగ్ ఇచ్చినట్టు ఒక వాయిస్ టేపును సృష్టించారన్నారు. తనకు తండ్రి సమానులైన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని దూషించినట్లుగా క్రియేట్ చేశారని గుర్తుచేశారు. దీనిపై పోలీసులు విచారణ జరుపుతారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాజమహేంద్రవరంలో సజావుగా సాగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక వైసీపీ వాళ్లు బురద జల్లుతున్నారన్నారు.మద్యం వ్యాపారులతో తాను మాట్లాడినట్టు వైరల్ అవుతున్న వాయిస్ టేపులు ఫేక్ అని టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. ఇటీవల ఏఐతో నకిలీ వీడియోలు, వాయిస్ టేప్‌లు సృష్టిస్తున్నారని అందులో ఇది కూడా ఒకటన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. మద్యం వ్యాపారులతో తాను మీటింగ్ పెట్టినట్టు నిరూపించాలన్నారు.తనకు లిక్కర్ షాపులు లేవని తాను మద్యం వ్యాపారులతో మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక మాజీ ఎంపీ భరత్‌రామ్ ఫేక్ వీడియోలు వాయిస్‌లు చూపించి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, శెట్టి జగదీష్, కంటిపూడి శ్రీనివాస్, దాస్యం ప్రసాద్ పాల్గొన్నారు.

'తూర్పుకాపు నేతను టార్గెట్ చేస్తున్నారు'

తూర్పుకాపు సంఘం నేత మజ్జి రాంబాబును టార్గెట్ చేయడం దారుణమని ఆ సంఘం నగర అధ్యక్షుడు పోలాకి పరమేష్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ భరత్‌రామ్ తూర్పుకాపుల రాజకీయ ఎదుగుదలను చూసి తట్టుకోలేక రాంబాబుపై బురద జల్లుతున్నారన్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో తూర్పుకాపులు 60వేల మంది ఉన్నారని, ఆర్థికంగా బలంగా లేకపోయినా సంఖ్యాపరంగా బలంగానే ఉన్నామన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడిగా నియమితులైనప్పటి నుంచి రాంబాబును భరత్‌రామ్ టార్గెట్ చేశారని, కక్ష గట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. చింతా జోగినాయుడు మాట్లాడుతూ హల్‌చల్ అవుతున్న ఫోన్ కాల్ వాయిస్ మజ్జి రాంబాబుది కాదన్నారు. సమావేశంలో అగురు ధనరాజ్, మీసాల నాగమణి, శనపతి సత్తిబాబు, కె.వెంకటేష్, మారి శ్రీనివాస్, బాలకృష్ణ, చిన్న, కృష్ణ, సందక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని మధ్యలోకి లాగవద్దు

మద్యం వ్యాపారులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సిండికేట్లు, నకిలీ మద్యం, బెల్టు షాపులు లేవని జిల్లా మద్యం వ్యాపారుల తరపున దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం(బాలు) శుక్రవారం తెలిపారు. టీడీపీ నగరాధ్యక్షుడు మజ్జి రాంబాబు, మరొక వ్యక్తి మధ్య జరిగిందంటూ మద్యం వ్యాపారం విషయమై ఓ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ ఆడియో రికార్డింగులతో తమకు సంబంధం లేదన్నారు. రాజకీయపరంగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ తమ ను, ఎక్సయిజ్ అధికారులను మధ్యలోకి లాగ డం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో ఆకుల శ్యాంబాబు, చిన్నం నాగమోహన్‌రెడ్డి, మేకా రమేష్, సానబోయిన సత్యనారాయణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి

గోకవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సోషల్, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్లో నెలకొన్న సమస్యలను ముందుగా గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్టు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, గోకవరం గ్రామాల్లో ఉన్న నాలుగు హాస్టళ్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి సమస్యలు, తాగునీరు, వెంటిలేషన్, వైద్య సదుపాయం, మెనూ అమలుపై విద్యార్థులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, వంట చేసే పద్ధతులను పరిశీలించారు. కొత్తపల్లి హాస్టల్‌లో ప్లేట్లు, గ్లాసులు సరిపడా లేనట్టు ఆయన దృష్టికి వచ్చింది.వాటిని అందించేందుకు గ్రామానికి చెందిన జనపరెడ్డి సుబ్బారావు ముందుకొచ్చారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు భరోసా

అనపర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను ధరించడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని, అది ప్రాణాలకు భరోసా ఇస్తుందని రవాణా శాఖాధికారి రాధిక అన్నారు. శనివారం అనపర్తిలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రాధిక మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని ఇంటికి ఆధారమైన వ్యక్తికి ప్రమాదం జరిగితే ఆ కుటుంబం పరిస్థితి ఏమౌతుందో చూస్తున్నామన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్లు ధరించి చేపట్టిన బైక్ ర్యాలీని ఆమె ప్రారంభించారు.ఏఎస్ఐ దుర్గాప్రసాద్, ఆటో కార్మికులు,పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

గోకవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. గోకవరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన మేకల అనిల్‌కుమార్, గారడి నితిన్‌లను అరెస్ట్ చేశామన్నారు. మండలంలో ఎవరైనా ప్రజలను ఇబ్బంది పెట్టినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకొని వారిపై రౌడీ షీట్‌లు తెరుస్తామన్నారు.

కొబ్బరికాయల చోరీపై ఫిర్యాదు

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలం కొప్పవరం-లక్ష్మీనరసాపురం రోడ్డుకు ఇరువైపుల ఉన్న కొబ్బరిచెట్ల కాయలు చోరీకి గురవుతున్నాయని కొప్పవరం పంచాయతీ కార్యదర్శి ఎస్.బుల్లెబ్బాయ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.దాని వల్ల ఆదాయం కోల్పోతున్నామన్నారు.

ప్రతీఒక్కరు ఒక మొక్క నాటాలి

» జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి » పలుచోట్ల స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలు


కడియంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీపీవో శాంతామణి


రాజానగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కడియం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు ఒక మొక్క నాటాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. నెలలో మూడో శనివారం సందర్భంగా పలుచోట్ల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి డీపీవో శాంతామణి విచ్చేసి మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల ఒక్కో అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ చెట్లను పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో చేపట్టిన సైకిల్ ర్యాలీని డీపీవో ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు పరికరాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, దేవళ్ళ రామ్మోహనరావు, చిక్కాల ఈశ్వరరావు, బొర్రు సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కె.రమేష్, తహశీల్దారు సునీల్‌కుమార్, ఎంఈవో నాగేశ్వరరావు, హెచ్ఎం టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో మండల పరిషత్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి ఎంపీడీవో వి.శ్రీనివాస్ ర్యాలీ జరిపారు.అనంతరం వంతెన వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఎస్ఐ వి.రవిచంద్రకుమార్, ఏవో నాగేంద్రప్రసాద్, ఏపీవో అగస్టీన్‌కుమార్, ఏపీఎం సుప్రియ, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలో జీజీయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నూకాలమ్మ ఆలయం కూడలిలో వాహనదారులకు, హైస్కూల్ విద్యార్థులకు వాయు కాలుష్యం తగ్గించడంపై ఎన్ఎస్ఎస్ అవగాహన కల్పించారు. ఇంధన వినియోగాన్ని తగ్గించ వల్ల వాయు కాలుష్యం తగ్గడంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ భౌతికశాస్త్రం సహాయ ఆచార్యులు ఎ.శాంతలత పాల్గొన్నారు.


బిక్కవోలులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల్లోని చెత్త, ఇతర వ్యర్థాలను పోగులుపెట్టి కాల్చివేయడం, కార్యాలయం ప్రాంగణంలో మొక్కల సంరక్షణ చేపట్టారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో క్లీన్ ఎయిర్ థీమ్‌తో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తన బంగ్లా నుంచి కార్యాలయానికి కాలినడకన వచ్చారు. విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. వాహనాల వినియోగం తగ్గించడం ద్వారా వాయుకాలుష్యం తగ్గుతుందన్నారు. వర్శిటీలోని విద్యార్థులు, అధికార్లు, అధ్యాపకులు, సిబ్బంది ఒక భవనం నుంచి మరో భవనానికి కాలినడకన వెళ్లేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చని చెప్పారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. క్లీన్ ఎయిర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జీఎస్టీ 2.0 కార్యక్రమంలో భాగంగా విద్యా సామగ్రిపై తగ్గిన పన్ను రేట్లు, వినియోగదారులకు కలిగే లాభాలు వంటి అంశాలను వివరిస్తూ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు.

అనపర్తి: అనపర్తిలో జరిగిన కార్యక్రమానికి గెయిల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజా రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో జరిగిన పర్యావరణ అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకమని, ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని వణికిస్తున్న గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్ వాడకాలు తగ్గించాలన్నారు. అనంతరం కార్యదర్శి ఎస్ఎస్ ఫణికుమార్ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి బాలికోన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి తహశీల్దార్ అనిల్‌కుమార్, సర్పంచ్ వారా కుమారి, సొసైటీ అధ్యక్షుడు దత్తుడు శ్రీను పాల్గొన్నారు.





శేష శైలా వాస శ్రీ వెంకటేశా.. నిదురించు మా అయ్య శ్రీ చిద్విలాస.. శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు.. అలమేలు మంగకు అలకరానీయకు.. అంటూ అర్చకులు స్వామికి శనివారం రాత్రి పవళింపు సేవ చేశారు.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకుని భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. స్వామిని మనసారా చూసి.. ఆపదమొక్కులవాడా.. అనాథరక్షక గోవిందా.. గోవింద అంటూ వేడుకున్నారు.. మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

8

శేష శైల వాసా.. శ్రీ వెంకటేశా!



ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి భాధ్యత అని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం వీఎల్‌పురంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమన్నారు. భావితరాల భవిష్యత్ మన చేతుల్లో ఉందన్నారు. దీనిలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఇప్పటి వరకు నగరంలో 4780 మొక్కలు నాటినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్సాలీ, ఏడీహెచ్ అనిత, సిఎంఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ కీర్తి

ఆదివారం ప్రత్యేకం



సర్కారు ఏం చేయగలదు?
అధికారంతో ఏదైనా చేయగలదు..
అభివృద్ధి చేయగలదు..
అరాచకమూ సృష్టించగలదు..
గత ఐదేళ్లూ జనం అరాచకం చూశారు..
భరించలేక ఓటుతో తరిమికొట్టారు...
ప్రభుత్వాన్నే మార్చేశారు..
ఇప్పుడేం చూస్తున్నారు?
హామీల అమలు చూస్తున్నారు..
అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారు..
గూగుల్ రాకతో మన గతి
సూపర్ అంటూ ఆనందపడుతున్నారు..
చీకట్లు తరిమికొట్టే చంద్రన్న పాలనలో
ఆనంద దీపావళికి సన్నద్ధమవుతున్నారు..

దీపావళి.. చెడుపై విజయానికి సూచిక.. చీకట్లు తొలగించి వెలుగులు అందించే పండగ.. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో చీకట్లు కమ్ముకున్నాయి.. కూటమి ప్రభుత్వంలో ఎన్నో కొత్త వెలుగులు వచ్చాయి. పింఛన్ల పెంపు నుంచి ఉచిత గ్యాస్, ఫ్రీబస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో, విద్యుత్ బిల్లుల తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజల జేబుల్లో కాసులు గలగలలాడుతున్నాయి. అటు కొత్తరేషన్ కార్డులు, పాస్ పుస్తకాల జారీ. గుంతల్లేని రహదారులు, ఇటు అభివృద్ధి, అటు పెట్టుబడుల వెల్లువతో జిల్లా ముఖచిత్రం మళ్లీ మారుతోంది. మూతపడ్డ అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి రూ.5కే పేదలు కడుపునిండా భోజనం చేసేలా చేస్తోంది. డీఎస్సీ పోస్టుల మొదలు మళ్లీ వచ్చే ఏడాది ఇంకో డీఎస్సీ, అటు పోలీస్, అటవీశాఖల్లో పోస్టుల భర్తీతో నిరుద్యోగుల మోము మతాబుల్లా వెలుగుతోంది.

- అరాచకపు చీకట్లు తొలగాయ్
- అభివృద్ధి వెలుగులొస్తున్నాయ్
- సంక్షేమంతో మంచి రోజులు
- సూపర్ సిక్స్ పథకాలతో వెలుగు
- పోస్టుల భర్తీతో నిరుద్యోగుల సంతోషం
- రేపే దీపావళి

నాడు కష్టాలు.. నేడు వెలుగులు

- **పింఛన్ల ధమాకా :** ప్రభుత్వం మారింది. ప్రజల దశ మారింది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు రూ.3 వేల పింఛన్ రూ.4 వేలు, అనారోగ్య బాధితులకు రూ.15 వేల చొప్పున పెంచి ఒకటో తేదీనే అందజేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 2,72,107 మందికి రూ.117 కోట్లు, కోనసీమలో 2,36,705 మందికి రూ.101 కోట్లు, తూర్పులో 2,35,502 మందికి రూ.103 కోట్లు అందుతున్నాయి. ఉద్యోగులకు ఒకటినే జీతాలిస్తున్నారు.
- **తల్లికి వందనం :** ఇచ్చిన హామీ మేరకే ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లివందనం డబ్బులు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో 5,88,378 మంది విద్యార్థులకుగాను 3,85,601మంది తల్లులఖాతాల్లో రూ.764 కోట్లు జమైంది.
- **ఉచిత గ్యాస్ :** ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలవుతోంది. ఉమ్మడి జిల్లాలో 13 లక్షలగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తొలి ఉచిత సిలిండర్ 11.52 లక్షల మంది వినియోగించుకోగా రూ.95 కోట్లు జమచేసింది.
- **ఉచిత బస్సు:** ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసింది. ఉమ్మడి జిల్లాలో 25.52 లక్షల మందికిపైగా మహిళలకు లబ్ధి చేకూరుతోంది.
- **అన్నదాత సుఖీభవ :** ఈ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.2 వేలకు, రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు కలిపి మొదటి విడతగా రూ.7 వేలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల మందికిపైగా రూ.300 కోట్లకుపైగా జమ చేసింది.
- **పాస్‌బుక్‌లు :** ఐదేళ్లపాటు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వకుండా గత వైసీపీ తిప్పలు పెట్టింది.ప్రభుత్వం మారాక రాజముద్రతో కాకినాడ జిల్లాకు 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూ.గో. 95 వేలు జారీ చేశారు.
- **డీఎస్సీ సక్సెస్ :** గత ఐదేళ్లపాటు ఆచూకీ లేని డీఎస్సీ పోస్టులను భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 1,241 మంది నిరుద్యోగులకు ప్రభుత్వ కొలువులు దక్కాయి. వచ్చే ఏడాది మరో డీఎస్సీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
- **ఉద్యోగులకు డీఏ :** దీపావళి కానుకగా ప్రభుత్వం ఉద్యోగులకు శనివారం ఒక డీఏ ప్రకటించింది. పోలీసులకు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ ఈఎల్ ప్రకటించింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఎర్న్‌లీవ్ ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు దీపావళికే పదోన్నతులు ఇస్తామని ప్రకటించింది.
- **జీఎస్టీ పండుగ :** ఇక కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలు లాభపడ్డారు. నిజమైన దీపావళి ఇది.

రోడ్లు వేశారు.. నరకం తప్పించారు!

వైసీపీ పాలనలో ప్రజలు రహదారులపై నరకం చూశారు. ప్రభుత్వం మారగానే సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో 900 కిలోమీటర్ల మేర అధికారులు 350కిపైగా రోడ్లను గుర్తించి రూ.70.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చారు. కాకినాడ- జొన్నాడ రహదారి రూ.225 కోట్లు, కాకినాడ -రాజమండ్రి కెనాల్ రోడ్డు రూ.160 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయ్..

సీఎం చంద్రబాబు కృషితో అనేక కంపెనీలు, పర్యాటక ప్రాజెక్టులు తరలివస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్, రూ.2,800 కోట్లతో కొత్తగా ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్లాంట్‌కు ఏర్పాటు చేయనుంది. కోనసీమ, కాకినాడలో రూ.300 కోట్లు పర్యాటక పెట్టుబడులు పెట్టనున్నారు.

నాడు మైక్రోసాఫ్ట్.. నేడు గూగుల్

నేడు హైదరాబాద్ ఇలా ఉందంటే దానికి కారణం చంద్రబాబు.. ఎందుకంటే నాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను రప్పించారు.. నేడు విశాఖకు గూగుల్ రప్పిస్తున్నారు. దీంతో నిరుద్యోగుల కష్టాలు తీరునున్నాయి. కొత్త వెలుగులు రానున్నాయి.. తూర్పుగోదావరి జిల్లాలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేశారు. మీకో బిజినెస్ ఐడియా ఉందా.. అక్కడికి వెళితే చాలు అంతా వాళ్లే చూసుకుంటారు.



చివరి వరకూ సాఫీగా కొనుగోళ్లు

- 27 నుంచి 221 కేంద్రాలు ఏర్పాటు
- 5.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి
- 4 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) అన్నదాత పంట పండింది.. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఏటా సాధారణంగా 2.5 మెట్రిక్ టన్నుల నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించేవారు.దీంతో చివరిలో రైతులు ఇబ్బంది పడేవారు.గత రబీ సీజన్‌లో చివరి రైతులు ఇబ్బందులు పడ్డారు.ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా రబీలో ధాన్యం మంచి ధరకు కొనుగోలు చేయడంతో పాటు 24 గంటల్లో నగదు రైతు ఖాతాల్లో జమ చేయడంతో అందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలనే ఆలోచనతో ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో చివరి పంట రైతులు ఇబ్బంది పడ్డారు. ఆ అను భవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతుల నుంచి ఈసీజన్‌లో ఎక్కువ ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది. మొత్తం 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేయగా అందులో 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సీఎంఆర్‌కు సేకరించడానికి ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థకు లక్ష్యం నిర్దేశించింది.ఈ నెల 27 నుంచి కొనుగోళ్లు ప్రారంభించనున్నారు.

74,793 హెక్టార్లలో సాగు

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 74, 793 హెక్టారల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఇప్పటి వరకూ 445.9 హెక్టార్లలో వరి కోతలు పూర్త య్యాయి. దీపావళి తర్వాత కోతలు పుంజు కుని డిసెంబరు 15వ తేదీ వరకూ కోతలు జరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఈ నెల 27 నుంచి ధాన్యం కొనుగోలు ఆరంభం కానుంది. ఇప్పటికే కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు. 221 రైతు సేవా కేంద్రాల్లో ఒకేసారి ధాన్యం కొనుగోళ్ల ఆరంభిస్తారు.17 శాతం తేమ ఉంటే కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీ క్వింటా ధాన్యానికి రూ.2369, గ్రేడ్-ఎ రకానికి రూ.2389 ఇవ్వవలసి ఉంది. గోనె సంచుల వినియోగచార్జీలు, కూలీల చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. క్వింటాకు గోనె సంచుల వినియోగచార్జీ రూ.4.74, కూ లీల చార్జీ రూ.22 వరకూ ప్రభుత్వం ఇస్తుం ది.మద్దతు ధరతో చార్జీలకు సంబంధం లేదు.

ఏం కష్టమొచ్చిందో.. పిల్లలను బడికి పంపి.. వివాహిత ఆత్మహత్య

స్కూల్ ఆటోను ఢీకొట్టిన కారు

8

రేపు పీజీఆర్ఎస్ రద్దు
కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని పురస్కరించుకుని సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు గమనించాలన్నారు. ప్రజలు సమస్యలను 1100 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. జిల్లా ప్రజలంతా సురక్షితంగా ఆనందంగా దీపావళిని జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం స్పెషల్ కలెక్టర్‌గా అభిషేక్‌కు బాధ్యతలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు ఎల్ఎఅండ్ఆర్ఆర్ అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ (2019 బ్యాచ్ ఐఏఎస్)కే స్పెషల్ కలెక్టర్ పోలవరం బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకూ ఇక్కడ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేసిన సరళా వందనం బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఐఏఎస్ వి.అభిషేక్‌కు ఫుల్ అడిషనల్ చార్జిని అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు ది గ్రేట్ రాజమహేంద్రవరం
షాపింగ్ ఉత్సవం

రాజమహేంద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వాణిజ్య, వ్యాపార రంగాలకు నూతనోత్సాహం నింపే లక్ష్యంతో ఆదివారం ఆనందరీజెన్సీ పందిరి ఫంక్షన్ హాల్‌లో ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పట్ల అవగాహనలో భాగంగా వినియోగదారుల్లో చైతన్యం నింపడానికి ఈ నెల 14నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. లక్కీడిప్ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.



కొండగుంటూరులో అక్రమ గ్రావెల్ తవ్వకం ప్రాంతంలో మైన్స్ అధికారులు

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మైన్స్ అధికారుల దాడి

దివాన్‌చెరువు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమ తవ్వకాలపై అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. మండలంలోని కొండ గుంటూరు పరిధిలోని హైటెన్షన్ విద్యుత్ లైన్ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నట్టు గనులు, భూగర్భ శాఖాధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు శనివారం ఆకస్మికంగా దాడులు చేశారు. చాలా కాలం నుంచి అక్రమంగా తవ్వడంతో కొండ ఖాళీ అయిపోయింది.గుట్టలు మాత్రమే మిగిలాయి. దీంతో అధికారులు అక్రమ తవ్వ కాలు సాగిస్తున్న యంత్రాలతో పాటు వాహ నాలను సీజ్ చేసినట్లు జిల్లా గనుల శాఖా ధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు జిల్లాలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.తనిఖీల్లో జ్యోతిర్మయి, శ్రీనివాస్, జిల్లా గనులు, భూగర్భశాఖతో పాటు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఎక్స్‌పోకు విశేష స్పందన

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ మెగా ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీ తగ్గిన ఎలక్ట్రికల్ పరికరాల ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరై ఎక్స్‌పోను పరిశీలించారు. జీఎస్టీ తగ్గింపు వివరాలను ఎస్ఈ తిలక్ కుమార్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకం ద్వారా అదనంగా 7 శాతం పన్ను తగ్గింపును పొందవచ్చన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు చిన్న ,మధ్యతరగతి ప్రజలకు నిత్యావసరాలను అందుబాటులోకి తెచ్చేలా రూపొందించారని చెప్పారు. ప్రదర్శనలో లైట్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు కంప్యూటర్లు, వాటర్ హీటర్లు, వాషింగ్ మిషన్లు, పునరుత్పాదక పరికరాలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.



స్టాల్స్ పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సోము

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుండడం రాష్ట్రానికి గర్వకారణమని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఐటీ విప్లవకారుడిగా గుర్తించాలని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు విషయంలో సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమని, భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు విశాఖపట్నం కీర్తి పెరుగుతుందన్నారు. గూగుల్ సెంటర్ వస్తే పర్యావరణానికి హాని అంటూ వైసీపీ నాయకుల సన్నాయి నొక్కులు ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డికి గూగుల్ అంటే భయమని..ఎందుకంటే వారి చరిత్ర అంతా గూగుల్‌లో దొరుకుతుందని ఎద్దేవా చేశారు.అనపర్తి నియోజకవర్గంలో తనపై ఆరోపణలు చేసేవారు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.మట్టి, మద్యం, ఇసుక కాంట్రాక్టుల్లో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.అవినీతి చేసినట్టు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పనిచేయాలి : స్పెషలాఫీసర్



చాగల్లు సెంటర్‌లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ

చాగల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిస రాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజ లు ఆరోగ్యంగా ఉంటారని మండల స్పెష ల్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన చాగల్లులో శనివారం విద్యార్థులతో కలిసి అధికారు లు, ప్రజాప్రతినిధులు సైకిల్ ర్యాలీ నిర్వ హించారు. ఈసందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యంగా మనవం తా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సి బ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే మద్దిపాటి



చిన్నాయిగూడెంలో విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దేవరపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. చిన్నాయిగూడెంలో శనివారం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రా రంభోత్సవాలు చేశారు. చిన్నాయిగూడెం వి ద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నాయిగూడెంలో కొత్తగా ఆర్‌డీ ఎస్ఎస్ స్కీమ్ కింద రూ.4 కోట్ల 20 లక్షలతో నిర్మించిన విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభించారు. దీనివల్ల రైతులకు నాణ్యమైన విద్యుత్ అందు తుందని, విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు 50 సెంట్లు భూమిచ్చిన గడా మురళీ అజిత్‌కుమార్ కుటుంబ సభ్యులను అభినందించారు. అలాగే స్థానిక ప్రభు త్వ హైస్కూల్‌లో నూతన తరగతిగది, కాలనీలో బోరుపైపు లైన్‌ను ప్రారం భించారు. రూ. 86 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకు స్థాపన, రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమం లో గోపాలపురం జనసేన పార్టీ ఇన్ చార్జి సువర్ణరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అంధ్రూ అనిల్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పిన్న మనేని వీరబాబు, సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు గన్నమని గోపాలకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గడా మురళీ అజిత్‌కుమార్, మద్దిపాటి సత్యనారాయణ, సర్పంచ్ జ్యోతి రాణి, టీడీపీ నాయకులు కాట్రగడ్డ శ్రీనివాస్ చౌదరి, బిలకా రాజేశ్, అల్లిన సురేంద్ర, గడా రామనరసింహారావు, పరిమి గంగాధరరావు, కొయ్యలమూడి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో క్వారీ నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత, పక్కన ఇతర అధికారులు

దేవరపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే మాధవి స్టోన్ క్రషర్స్‌కి అనుమతి కోసం శనివారం ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. కొవ్వూరు ఆర్‌డీవో రాణీసుస్మిత అధ్య క్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ క్వారీ అనుమ తికి 29 మంది అభిప్రాయాలు తెలిపారని, అందులో 12 మంది అభిప్రాయాలు తెలియజేశారన్నారు. 15 మంది లిఖితపూర్వకంగా అను మతులు తెలియజేశారన్నారు. తూర్పుగోదా వరి జిల్లా క్వారీ అండ్ క్రషర్స్ యాజమానుల సంఘం అధ్యక్షుడు అంధ్రూ అనిల్ మాట్లాడు తూ క్వారీ పరిశ్రమ గత 5, 6 సంవత్సరాల నుంచి సంక్షోభంలో ఉందన్నారు. క్వారీ క్రషర్లు ప్రస్తుతం 20 మాత్రమే ఉన్నాయని తెలిపారు. మాధవి స్టోన్ క్రషర్స్ యాజమాని కే.నాగమో హన కృష్ణ గణేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబం ధనల ప్రకారమే క్వారీని ఏర్పాటు చేయడం జరుగుతుందని లక్ష్మీపురం గ్రామాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అంది స్తామని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ పొల్యూషన్ బోర్డు ఈఈ ఎండీఎస్ శంకరరా వు, క్వారీ యాజమానులు, ఎన్జీవోలు, వివిధ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

సొసైటీల బలోపేతానికి చర్యలు

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

● కానూరు సొసైటీలో రైతులకు రూ. 23 లక్షల డివిడెంట్ల పంపిణీ



రైతులకు డివిడెంట్ చెక్కులు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథ మిక వ్యవసాయ పరపతి సంఘాలు బలంగా ఉంటే ఆ సొసైటీ పరిధిలోని రైతులు కూడా అభివృద్ధి చెందుతారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం కానూరు విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు సుమారు రూ. 23 లక్షల డివిడెంట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ సహకార సం ఘాలు బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉం దన్నారు. అలాగే రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సొసైటీల ద్వారా అందిస్తోం దన్నారు. ధాన్యం సకాలంలో కొనుగోలు చేసేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలోని సొసైటీలన్నింటికీ ఆదర్శంగా నిలిచి కానూరు పేరు గడించిందని చమత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వాకలపూడి వీర్రాజు, డైరెక్టర్లు కూనపరెడ్డి రత్నకుమారి, ఆరేపల్లి వీర వెంకట సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి ముళ్లపూడి వెంకట రమణ, సర్పంచ్ బావన మధు, వైస్ ఎంపీపీ ఉసారాణి, భూపతిరాజు రవివర్మ, కూటమి నాయకులు ముళ్ళపూడిరాజేంద్ర ప్రసాద్, రంకిరెడ్డి ప్రసాద్, పిప్పర రవి, కోలా సీతయ్య నాయుడు, సొసైటీ కార్యదర్శి బొప్పిలి బలరామకృష్ణం పాల్గొన్నారు.

రోడ్డుకు శంకుస్థాపన

పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. కోటి 70 లక్షల నాబార్డు నిధులతో పెరవలి జా తీయ రహదారి నుంచి కొత్తపల్లి అగ్రహారం మీదుగా కాపవరం వెళ్లే రహదారికి శంకుస్థాపన చేశారు. అనంతరం పలు విషయాలపై మాట్లా డారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ బండా రు వెంకట రమణ సాయిబాబా, అల్లిశెట్టి నత్తి రాజు, గంగోలు సీతమ్మ, రాపాక ప్రమీల, బండా రు బాబీ, ఐక్రే దొరసామి, ఉలుసు సౌజన్య, నల్ల సురేంద్ర, బొడ్డు రామాంజనేయులు, సరాది కృష్ణమూర్తి, తహశీల్దార్ నిరంజన్, ఎంపీడీవో వెంకట పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ కొవ్వూరే లక్ష్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదా వరి పుష్కరాల నాటికి కొవ్వూరు పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ తయారు చేయడమే లక్ష్యమని, దానికి ప్రజలు, మున్సిపల్ సిబ్బంది సహకరిం చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి విజయ విహార్ సెంటర్ వరకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్య వంతమైన జీవితం అనే నినాదంతో ర్యాలీ నిర్వ హించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. తర్వాత మెయిన్‌రోడ్డు లోని డివైడర్‌లో పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్న కుమారి మాట్లాడుతూ సమాజంలో ప్రతివ స్వచ్ఛ కర్మీగా మారిందన్నారు. మా జీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, బొందాడ సత్యనారాయణ, టీడీపీ టీ.మణి రామ్, ఏఈ సుమంత్, మున్సిప ల్ మేనేజర్ భరత్, ఆర్‌వో డి.శ్యామ్, భరత్, శాని టరీ ఇన్‌చార్జి రవి, మున్సిపల్ హైస్కూల్ విద్యా ర్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శశాంక

దేవరపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి బీశశాంక పేర్కొ న్నారు. టీహెచ్ఎస్ఆర్ వీఏఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం డిగ్రీ విద్యార్థులకు ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాం డెంట్ సువర్ణరాజు, ఏవో ఆనంద్ ప్రసాద్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని, దీనివల్ల ప్రాణాలకు భరోసా కలగడమే కాకుండా, కుటుంబానికి కూడా రక్షణ కల్పిస్తుందని రాజమహేంద్రవరం రవాణా శాఖ అధికారిణి రాధిక అన్నారు. శనివారం అనప ర్తిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనపర్తి ఎస్ఐ దుర్గాప్రసాద్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు ఏడు ఫిర్యాదులు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థా నంలోని టీడీపీ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివా రం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మొత్తం ఏడు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యా దులను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామ న్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నాలు వారి సత్రంలో శనివారం 8వ రాష్ట్రీయ పోషణమాసం 2025 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి లుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పాల్గొని గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. అనంతరం ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కా ర్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంట మణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, అర్లిల్లి రామకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, తోరం నరేష్, నాళం శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

సాహెబ్ కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం



దుద్దుకూరులో సాయం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

దేవరపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దుద్దుకూరుకి చెందిన గ్రామ రెవెన్యూ సహా యకుడు షెంటు సాహెబ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన కుటుంబానికి శనివారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం నుంచి రూ. 25 వేల ఆర్థికసాయాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాపిరాజు, కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు కేరవిక్రమ్, కొవ్వూరు డివిజన్ కార్యదర్శి మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

హృదయాలయానికి నిత్యావసర వస్తువులు



శంకరాపురంలో వస్తువులు అందిస్తున్న రోటరీ సెంట్రల్ ప్రతినిధులు

నిడదవోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ప్రత్యక్ష దైవాలని, ప్రతిఒక్కరూ వారికి సహాయ సహకారాలు అందించాలని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ అధ్యక్షు డు పైడి సురేష్ అన్నారు. శనివారం శంకరా పురంలోని మానసిక దివ్యాంగుల సంస్థ హృ దయాలయానికి రోటరీ సెంట్రల్ ఆధ్వర్యం లో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షట్టి నరేజులు పురస్కరించుకుని కొలుకులూరి శ్రీలక్ష్మి, ఆత్కూరి సురేష్ చౌదరి ఆర్థిక సహకా రం అందించడం ఎంతో అభినందనీయమ న్నారు. కార్యక్రమంలో జీవీవీ సత్యనారాయ ణ, బూరుగుపల్లి సత్యనారాయణ, కొండె పాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం



దొమ్మేరులో అన్నదానం చేస్తున్న నరసింహారావు

కొవ్వూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దొమ్మేరు ఆదరణ అంధుల ఆశ్రమ విద్యార్థు లకు శనివారం కొవ్వూరుకి చెందిన యళ్ల నరసింహారావు అన్నదానం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈయన కుమార్తె గాదిరాజు ఓంకార నాగదేవి (లండన్) అంధుల ఆశ్రమంలోని ముగ్గురు దివ్యాంగ విద్యార్థులను దత్తత తీసు కున్నారు. వారి చదువుకు అయ్యే ఖర్చును ఆమే భరిస్తున్నారు. ఆశ్రమ నిర్వాహకుడు అక్కుబత్తుల జాన్, తదితరులు పాల్గొన్నారు.

'రెండు, మూడు రోజుల్లో పరిహారం అందిస్తాం'

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వి. సావరంలో బాణా సంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదం లో మృతులకు రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తుందని ఎమ్మె ల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శని వారం అనపర్తి సావరంలో మృతులు పెంకే శేషారత్నం, కుడిపూడి జ్యోతి దశ దిన కర్మలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే



పీఏసీఎస్‌లో బాణాసంచా విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



దీపావళిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కొవ్వూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపా వళి పండుగను ప్రతిఒక్కరూ ఆనందంగా జరు పుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక శ్రీరామా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పా టుచేసిన బాణసంచా విక్రయ కేంద్రాన్ని ఎమ్మె ల్యే ప్రారంభించి మాట్లాడుతూ దుకాణాల్లో ప్ర భుత్వ నిర్దేశించిన నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమి టీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మున్సి పల్ చైర్‌పర్సన్ బావనరత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, తోరం నరేష్, అర్లిల్లి రామకృష్ణ, నాళం శ్రీనివాసరావు, బి.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి : పట్టణ సీఐ

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటిం చాలని పట్టణ సీఐ పి.విశ్వం అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ జీదేవ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్ నుంచి బస్టాం డ్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎస్ఐ గారపాటి శ్రీనివా సరావు, హెచ్ఎం ఎసత్యనారాయణ, వల్లి, వెం కట్, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం కెశ్రీనివా సన్, పీడీ కెసౌజన్య, యు.భాస్కరరెడ్డి, విద్యా ర్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: సంప్రదాయబద్దంగా దీపావళి జరుపుకోవాలని ఎస్ఐ తోట రామకృష్ణ అన్నారు. శనివారం మలకపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సేవ్ ద ఎర్త్ సేవ్ ద వర ల్డ్ అంటూ నినాదాలు చేశారు. ఎస్ఐ మాట్లా డుతూ పర్యావరణానికి హాని కలిగించే విధంగా దీపా వళి ఉండరాదన్నారు. కార్యక్రమం లో విద్యార్థులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

● వైభవంగా స్వామివారి చక్రస్నానం

● మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం

● స్వామివారి ఏకాంత సేవ

● ముగింపు ఉత్సవంలో ఎమ్మెల్యే బండారు కుటుంబ సభ్యులు



చక్రస్నాన మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు, చైర్మన్, ఈవో

ఆత్రేయపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వా మి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వ హించారు. అనంతరం నవకలశ మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. విశ్వక్సేన పూ జ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించా రు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరా వుతోపాటు తనయుడు సంజీవ్ దంపతులు స్వా మివారిని దర్శించుకుని మహాపూర్ణాహుతి కార్య క్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారు వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ మేళతాళ మంగళవాయిద్యాలతో గౌతమి గోదావరివద్దకు వేంచేశారు. అనంతరం స్వామివారి చక్రస్నాన మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉపకమిష నర్ నల్లం సూర్యచక్రధరరావు దంప తులతోపాటు వేలాది మంది భక్తులు స్వామివారి చక్రస్నాన మహోత్స వంలో పాల్గొని తన్మయత్వం పొందారు. వైఖానస ఆగమశాస్త్ర ప్ర కారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్ర సాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపం డితులు బ్రహ్మోత్సవ పూజలు నిర్వ హించారు. అనంతరం ధ్వజావరో హణం నిర్వహించి బ్రహ్మోత్సవా లను ముగించారు. రాత్రి స్వామివారి విశ్వ క్సేనపూజ, పుణ్యాహవచనము, మహాదాశీర్వచనం నిర్వహించి స్వామివారిని అద్దాల మండపంలో వివిధరకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ కన్నుల పండువగా నిర్వహించారు. తొమ్మిది రోజు లపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకా రుల వాయిద్యాలు, విద్యుత్, పుష్పాలంకా రణ, ఫొటోషూటు విశేషంగా ఆకట్టుకున్నాయి.

● **పోటెత్తిన భక్తజనం...**

ఆలయంలో శనివారం వివిధరాష్ట్రాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. ఈరు మాడవీధులలో స్వామివారి ఏడుప్రదక్షిణలు ని ర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివా రిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీక రించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ... లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

● **యథావిధిగా ఆర్జిత సేవలు**

బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు ఆదివారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. అష్టోత్తర పూజలు, కల్యా ణాలు నిర్వహించుకునే భక్తులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

● అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు

● అత్తింటి వేధింపులే కారణమంటున్న మృతురాలి తల్లి

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ఆత్మహత్యకు పాల్పడిన శిరీష

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్షణికా వేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. అనపర్తిలో శనివారం జరిగిన ఈ సంఘటన హృదయ విదారకంగా మిగిలింది. అనపర్తి మండ లానికి చెందిన నమ్మి సంతోష్ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆతడికి దువ్వాళ్ళ రానికి చెందిన శిరీష (30)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. కొంతకాలంగా వీరు అనపర్తిలోని సిందు టవర్స్‌లో నివాసం ఉంటున్నారు. శని వారం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర వాత ఒక పాపను, బాబును స్కూలుకు పంపిం చిన శిరీష బెడ్‌రూమ్‌లో వెళ్లి తలుపు గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆమె ఎం తకూ పలకకపోవడంతో అత్త కృష్ణవేణి చుట్టుప క్కల వారిని పిలవగా వారు తలుపును పగుల గొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలా డుతూ కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిం చారు. కాగా ఉదయం జండా బామ్ కనిపిం చడం లేదని అడిగినా వెతుక్కోం డని శిరీష సమాధానం చెప్ప డంతో కొంత ఘర్షణ జరిగిందని, తాను ఇంటి నుంచి వెళ్లిపోయా నని సంతోష్ చెబుతున్నారు. అయితే మృతురాలి తల్లి లంక అమ్మాజీ మా త్రం భర్త, అత్త, ఆడపడుచు వేధింపుల వల్లే తమ కుమార్తె మరణించిందని చెబుతోంది. కుమార్తె మృతితో ముగ్గురు చిన్నారులు అనాథల య్యారని ఆమె చేస్తున్న రోదన చూపరులను కలచివేసింది. రెండేళ్ల కూడా నిండని శిరీష కుమార్తె ఇంటికి వచ్చిన పోలీసులతో ముద్దు ముద్దు మాటలు చెప్తుతూ అమ్మ అమ్మ అంటూ మృతదేహం ఉన్న గదివైపు రమ్మని పోలీసులను పిలవడం అక్కడున్న వారి హృదయాలను కలచి వేసింది. ఈ మేరకు మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

స్కూల్ పిల్లల

ఆటోను ఢీకొన్న కారు

● ముగ్గురు చిన్నారులకు స్వల్ప, ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో ఆటో

రాజానగరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా శనివారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్కూలు పిల్లలతో దివాన్‌చెరువు నుంచి వస్తున్న ఆటో గైట్ కళాశాల ఎదురుగా యూటర్న్ తీసుకుని సర్వీసు రోడ్డు నుంచి చక్రద్వారబంధం వెళ్ల న్న తరుణంలో వేగంగా వస్తున్న కారు ఆటోను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చక్రద్వారబంధం గ్రామానికి చెం దిన కొంతమంది విద్యార్థులు దివాన్ చెరువులోని సూర్యగ్లోబల్ స్కూల్లో 5,6,7 తరగతులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో గైట్ కళాశాల వద్ద సర్వీసు రోడ్డులో ఆటోను ఢీకొనడంతో ఆటో పల్టీలు కొడుతూ బోల్తా పడింది. దీంతో ఆందులో ఉన్న 11 మంది పిల్లల్లో ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, ఆటోడ్రైవర్ కుక్కల శ్రీనుకు బలమైన గాయా లయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.